ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

3

సోమవారం 1 ఏప్రిల్ 2024

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 20.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:26 (సోమ)
సహర్ : 4:37 (మంగళ)



ఆచంట చర్చిలో ప్రార్థనలు

ఘనంగా ఈస్టర్

ఏసుక్రీస్తు సిలువపై ప్రాణాన్ని విడిచి మూడో రోజు పునరుత్థారుడై తిరిగి సమాధి నుంచి లేచిన రోజు ఈస్టర్.. క్రైస్తవులు ఆదివారం జిల్లా అంతటా ఈ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. క్రీస్తు నేడు లేచెను.. హల్లెలూయ అంటూ గ్రామ పురవీధుల్లో కీర్తనలు పాడుతూ ఊరేగింపు నిర్వహించారు. స్మశాన వాటికకు వెళ్లి తమ కుటుంబ సభ్యుల సమాధులను ప్రత్యేకంగా పూలతో అలంకరించి ప్రార్థనలు చేశారు.



భీమవరంలో అలంకరించిన సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఏమి మారింది ?



గ్రామాల్లో ఈ ఐదేళ్లలో అభివృద్ధి మచ్చుకు కూడా కనబడని పరిస్థితి. ఎక్కడా ఒక సీసీ రోడ్డు వేయలేదు. తాగునీటి వసతులు కల్పించలేదు. వేసవి వస్తే ఇంకా దాహం కేకలు వినిపిస్తూనే ఉన్నాయి. గ్రామ పాలన మెరుగు పరుస్తామని వైసీపీ ప్రభుత్వం పంచాయతీల స్థానే కొత్తగా సచివాలయాలు ఏర్పాటు చేసింది. వందల కొద్దీ సిబ్బంది, కోట్లలో జీతాలు వెచ్చిస్తోంది. గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులపై దృష్టి పెట్టలేదు. పంచాయతీలు ఉన్నప్పుడు ఎటువంటి అభివృద్ధి జరిగిందో అంతకు మించి ఒక ఇంచు కూడా ఎక్కడా అభివృద్ధి కానరావడం లేదు..

ఐదేళ్లలో రహదారులేవి.. స్వచ్ఛమైన నీరేది ?

409 గ్రామాల్లో 403 సచివాలయాల ఏర్పాటు

4,200 సిబ్బందికి నెలనెలా కోట్లలో జీతం

కోట్లాది రూపాయలతో భవనాల నిర్మాణం

మౌలిక వసతులపై దృష్టిపెట్టని ప్రభుత్వం

భీమవరం రూరల్, మార్చి 31 : గ్రామాల్లో సచివాలయాలు పెట్టాం. ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చాం అంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం డప్పు కొట్టుకుంది. అందుబాటులో ఉద్యోగులు ఉన్నారు.. గ్రామం చూస్తే ఐదేళ్ళ క్రితం ఎలా ఉందో ఇప్పుడు అంతే.! అభివృద్ధి లేదు. సమస్యలు కోకొల్లలు. సర్పంచ్‌లకు ఎన్నికైన నాయకులకు కనీస మర్యాద లేదు. సర్పంచ్ అంటే ఒకప్పుడు గ్రామ పెద్దగా భావించేవారు. ప్రథమ పౌరుడు అంటూ వేనోళ్ల పొగిడేవారు. సచివాలయాలు ఏర్పడిన తర్వాత పూర్తిగా సర్పంచ్‌ల ప్రాధాన్యం తగ్గిపోయింది. చెప్పుకోవడానికి అభివృద్ధి పనులు లేవు. జిల్లాలోని 20 మండలాల్లో 409 గ్రామ పంచాయతీలున్నాయి. వాటి పరిధిలో మరో 403 సచివాలయాలు ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి, అటెండర్, ఇద్దరు సిబ్బంది ఉన్నారు. అదే సచివాలయంలో గ్రామానికి 10 మందికిపైగా సిబ్బందిని నియమించారు.దీంతో జిల్లాలో 403 సచివాలయాలలో గ్రేడ్-5, 403 మంది గ్రేడ్-8 పంచాయతీ సెక్రటరీలు, 245 మంది డిజిటల్ అసిస్టెంట్ లతో పాటు మొత్తం 4200 మంది సిబ్బంది గ్రామాల్లో సేవలు అందిస్తున్నారు. వీరికి నెలకు జీతాలు నిమిత్తం రూ.14 కోట్లు పైగా ఖర్చు పెడుతోంది. అంతే తప్ప గ్రామాల అభివృద్ధి పనులకు సొమ్ములు పెట్టడంలో దృష్టి పెట్టలేదు.



ఫిల్టర్ బెడ్‌ల మరమ్మతులు లేక పసర్లుగా కనిపిస్తున్న మంచినీరు

గడిచిన నాలుగేళ్లలో సచివాలయాల నిర్మాణానికి రూ.150 కోట్లు పైగా పెట్టు బడి పెట్టారు. గ్రామాల అభివృద్ధికోసం మాత్రం ప్రత్యేకంగా ప్రభుత్వం నిధులు కేటాయించ లేదు. గడిచిన ప్రభుత్వం హయాంలో ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉన్న ఇద్దరి సిబ్బందితో ఎలా పరిపాలన జరిగిందో పదుల సంఖ్యలో ఉన్న సిబ్బంది సచివాలయాలతో అదే పని జరుగుతోంది.



భీమవరంలో అభివృద్ధికి నోచుకోని రహదారి

గతమెంతో ఘనం

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ నిధులతో సీసీ రహదారులు, డ్రెయిన్‌లు నిర్మించారు. పెద్దమొత్తంలో 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించారు. ప్రతి గ్రామంలోనూ 70 శాతం మేర రహదారులు పూర్తయ్యాయి. నిరంతరం గ్రామాల్లో పనులు అందుబాటులో ఉండేవి. గ్రామీణ ప్రాంతంలో నిత్యం ఉపాధి లభించేది. తాగునీటి సమస్యల లేకుండా వాటర్ ప్లాంట్‌లు అందుబాటులోకి తెచ్చారు.వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటర్ ప్లాంట్‌లు మూలనపడ్డాయి. మంచినీటి పథకాల అభివృద్ధి అంతంత మాత్రంగా మారింది. ఫిల్టర్ బెడ్‌ల మరమ్మతులే కష్టంగా మారింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ నిధులను ఉపయోగించి సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. అంతే తప్ప గ్రామ అభివృద్ధికి పైసా ఉపయోగించలేదు. సీసీ రహదారులు అరకొరగా మారాయి. అది కాస్తా ఒక్కో గ్రామంలో అయితే ఒక్క రహదారి వేయని గ్రామాలుగా ఐదేళ్లలో చాలా గ్రామాలు నిలిచాయి. ఎర్ర కంకర రహదారి కూడా వేయలేదే అని గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

దారి మళ్లిన నిధులు

వైసీపీ ప్రభుత్వంలో గ్రామాలకు గ్రహణం పట్టింది. కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసిన ఆర్థిక సంఘం నిధులను సొంత అవసరాలకు వినియోగించుకుంది. ఆ తర్వాత విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నట్టు ప్రకటించింది. ఇలా ఆర్థిక సంఘం నిధులు కూడా పంచాయతీలకు అందుబాటులో లేకుండా చేసింది. ఒక్క రహదారికూడా నిర్మించలేకపోయారు. ఇటీవల ఒక్కో సచి వాలయం పరిధిలో రూ. 20 లక్షల నిధులను కేటాయించారు. వాటి పనులు కూడా పూర్తి కాలేదు. డ్రెయిన్‌లు కూడా నిర్మించలేకపోయారు. మంచినీటిని సక్రమంగా సరఫరా చేయడానికి పంచాయతీలు ఇబ్బంది పడ్డాయి. కాంట్రాక్ట్ సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని దుస్థితిని ఎదుర్కొన్నాయి. కొందరు నాయకులే సొంత సొమ్ములతో వేతనాలు ఇచ్చారు. మంచినీరు అందించే ఫిల్టర్ బెడ్‌లు కనీస మరమ్మతులకు నోచుకోలేదు. గతంలో గ్రామీణ నీటి పారుదల శాఖకు నిధులు మంజూరు చేసేవారు. ఆ నిధులతోనే గ్రామాల్లో ఫిల్టర్ బెడ్‌లు మరమ్మత్తులు జరిగేవి. వైసీపీ హయాంలో గ్రామీణ నీటి పారుదల శాఖను పూర్తిగా విస్మరించారు. టీడీపీ హయాంలో అమలులోకి వచ్చిన జలజీవన్ మిషన్‌కే పరిమితమయ్యారు అదికూడా సకాలంలో పనులు చేపట్టలేక పోయారు. పైప్‌లైన్ పనులు పూర్తి చేయకుండానే ఇటీవల పల్లెల్లో శిలా ఫలకాలు వేసేశారు. ఇలా ప్రజలను ప్రభుత్వం మభ్య పెట్టింది. మరోవైపు పెన్షన్, ప్రధానమంత్రి ఆవాస యోజన్‌లో కేంద్రం ఇస్తున్న రూ.180 లక్షల నిధులతో గ్రామాలకు కోట్లు వెచ్చించామంటూ సచివాలయాల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. అంతే తప్ప గ్రామ అభివృద్ధి కోసం నిధులు వెచ్చించామని ప్రభుత్వం చెప్పుకోలేకపోయింది.



రోడ్డెక్కిన సర్పంచ్‌లు

గ్రామాల్లో అభివృద్ధి లేదు. సర్పంచ్‌లకు గౌరవం లేదు. పంచాయతీ రాజ్ వ్యవస్థ నిర్వీర్యం అయిపోయింది. పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు రోడ్డెక్కే దుస్థితి ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వంలో సొంత పార్టీ సర్పంచ్‌లే నిరసనలు తెలిపారు. గ్రామాలకు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌ల విధులను గౌరవించాలని పట్టుబట్టారు. అయినా ప్రభుత్వం పెద్దగా పట్టించు కోలేదు. దాంతో సొంత పార్టీపైనే సర్పంచ్‌లు కారాలు మిరియాలు నూరు తున్నారు. ఇటువంటి దారుణ పరిస్థితులు ఎన్నడూ లేవని మండి పడుతున్నారు. ఎంపీ రఘురామకృష్ణంరాజు నిధులను వినియోగించుకుని తెలుగుదేశం, జనసేన సర్పంచ్‌లు ఉన్న పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. అధికారంలోకి వస్తే కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తామంటూ ఎన్నికల ముందు వైసీపీ నేతలు ఇచ్చిన హామీలు నెరవేరలేదు.ఇలా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. సర్పంచ్‌లకు గౌరవంలేకుండా పోయిందన్న ఆవేదన స్థానిక నాయకత్వంలో ఏర్పడింది.

15 వరకు ఓటు హక్కు నమోదుకు అవకాశం

భీమవరం టౌన్, మార్చి 31 : ఇప్పటి వరకు ఓటర్ల జాబితాలో ఓటు నమోదు కాకపోతే మరోసారి ఓటుహక్కు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం ఈనెల 15వ తేదీవరకు అవకాశం ఇచ్చింది . దరఖాస్తు చేసుకుంటే కనీసం వారంరోజులు గడువు ఉండాలి. అన్ని సక్రమంగా ఉంటే తప్పకుండా ఓటుహక్కు కల్పిస్తామని అధికారులు చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు వెబ్‌సైట్‌లో ఫోన్ నెంబరుతో www.nvsp.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని లాగిన్ కావాలి. అందులో కొత్తఓటు కోసం విభాగంలో క్లిక్ చేస్తే దరఖాస్తు వస్తుంది. దానిని పూర్తిచేసి సబ్‌మిట్ చేస్తే సెల్‌కు ఐడీ నెంబరు వస్తుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారి అడ్రస్ ఆధారంగా బీఎల్‌వో విచారణకు వస్తారు. ఈ సందర్భంలో 18 ఏళ్లు నిండినట్లుగా వారికి ఖచ్చితమైన ఆధారం చూపించాల్సి ఉంటుంది. పట్టణంలోగానీ, గ్రామంలోగానీ వార్డుకు సంబంధించి బీఎల్‌వోలు ఉంటారు.వారి వద్ద ఫారం-6 ఉంటుంది.దానిని పూర్తిచేసి కూడా ఇవ్వవచ్చు.వారికి ఆధార్ కార్డుతో పాటు, వయసు నిర్ధారణ ధృవీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. విచారణ చేసి అర్హత ఉంటే ఓటుహక్కు కల్పిస్తారు. అర్హత కలిగి ఓటు హక్కులేని వారు ఈ ఎన్నికల్లో ఓటు వేసుకునేందుకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. లేని పక్షంలో మరో ఐదేళ్లు ఆగాల్సిందే.

ఓటరు కార్డు లేకపోతే..

12 రకాల గుర్తింపుకార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటేయండి : కలెక్టర్



ఎన్నికలలో ఓటరు గుర్తింపు కార్డును చూపించి తమ ఓటు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ తెలిపారు. ఎపిక్ కార్డు లేని వారు ప్రత్యామ్నాయంగా ఫోటో గుర్తింపు కార్డులను చూపించి ఓటు వేయవచ్చునన్నారు. ఆధార్ కార్డు, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, బ్యాంక్, పోస్టాఫీసు జారీచేసిన ఫోటోతో కూడిన పాస్ బుక్‌లు, కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేయబడిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఎన్‌పీఆర్ కింద ఆర్‌బీఐ జారీ చేసిన స్మార్ట్‌కార్డు, భారతీయ పాస్‌పోర్టు, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం, పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల ద్వారా ఉద్యోగులకు జారీ చేయబడిన ఫొటోతో కూడిన సేవా గుర్తింపు కార్డులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ జారీ చేయబడిన అధికారిక గుర్తింపు కార్డులు, ప్రత్యేక వైకల్యం ఐడీ (యుడి ఐడీ), 12 రకాల గుర్తింపు కార్డులను ఓటర్లు పోలింగ్ కేంద్రాలలో చూపించి ఓటుహక్కును విని యోగించుకోవచ్చని సూచించారు. ఎన్నికల నాటికి సంబంధిత గుర్తింపు కార్డును సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

ఉమ్మడి వ్యూహం

వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టే ప్రయత్నాలు

గీత దాటుతున్న వారిపై కమిషన్‌కు ఫిర్యాదులు

ఊరూరా ప్రచారంలో అందరికంటే ముందడుగు

నియోజకవర్గాల వారీగా ఆత్మీయ సమావేశాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



ఏలూరులో అభివాదం చేస్తున్న ఉమ్మడి పార్టీల నాయకులు

ఎంపీ స్థానం నుంచి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థుల వరకు ఉమ్మడిగా రంగంలోకి దిగారు. అధికార వైసీపీని నేరుగా ఢీ కొట్టేందుకు ఒకేలా ముందుకు సాగుతున్నారు. పోలింగ్‌కి పట్టుమని ఇంకా 40 రోజులే మిగిలి ఉండగా, పట్టుదల, సరికొత్త ప్రణాళికలతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ఆయా నియోజక వర్గాల్లో దూకుడుగా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికార వైసీపీ ఎత్తిగడలను తిప్పికొడుతూనే ఇంకోవైపు అందరిని కూడకట్టుకుని ఇంటింటికి వెళ్ళి సూపర్‌సిక్స్‌తో పాటు వివిధ పథకాలను వివరిస్తూ తమ గెలుపు అభివృద్ధికి మలుపు అని వారిని మెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఇప్పటికే ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల బరిలో ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించారు. దీనికి అనుగుణంగానే ఎక్కడా పొరపొచ్చాలు తలెత్తకుండా నియోజకవర్గాల వారికి మూడు పార్టీలు ముఖ్య నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నారు. ఆయా నియోజక వర్గాల్లో తాజాగా నెలకొన్న స్థితిగతులను వీటిని అధిగమించేందుకు, తమకు అనుకూలంగా మలుచుకునేందుకు వీలుగా ప్రత్యేక కార్యాచరణకు దిగారు. ఏలూరు ఎంపీస్థానం నుంచి పుట్టా మహేష్ యాదవ్, నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ పక్షాన ఉమ్మడి అభ్యర్థి శ్రీనివాసవర్మ ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న ఉమ్మడి అభ్యర్థులతో పరస్పర సహకారం ఈ కొద్ది సమయంలోనే పెంచుకున్నారు. నిరంతరం సమన్వయం, సహకారం కోసం ప్రత్యేక కమిటీలు వేశారు. ప్రచారపర్వం దగ్గర నుంచి గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ముఖ్యనేతల భేటీల్లోనూ ఇప్పటికే నిరంతరం సమీక్షలు, సంప్రదింపులు కొనసాగుతూనే ఉన్నాయి. ఏలూరు లోక్‌సభ స్థానం బరిలో తెలుగుదేశం పక్షాన ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ తాజాగా అన్ని అసెంబ్లీ స్థానాల నుంచి పోటీచేస్తున్న అభ్యర్థులతో నేరుగా ముఖాముఖి భేటీ అయ్యారు. బీజేపీ, జనసేన నేతలతో పరస్పరం సంప్రదింపులకు దిగుతున్నారు. ఎక్కడా మాట జవదాటకుండా జాగ్రత్త పడుతున్నారు. ఆ పార్టీ నేతలతో మాట్లాడడం, వారి మద్దతుతో ఆయా నియోజక వర్గాల్లో దూకుడుగా వెళుతున్నారు. ఇప్పటికే కైకలూరు, ఏలూరు, ఉంగుటూరు నియోజక వర్గాల్లో ఆత్మీయ సమావేశాల్లోనూ పాలుపంచు కున్నారు. మరోవైపు ఏలూరు అసెంబ్లీ స్థానం నుంచి బడేటి చంటి, ఇప్పటికే ఇతర పార్టీల నుంచి భారీగా టీడీపీలో చేరేందుకు వస్తున్న వారిని ఆకట్టుకుంటున్నారు. ఏలూరు నగరంలో పైచేయి సాధించిన పక్కా ప్రణాళికతో ఉన్నారు. మరోవైపు జనసేన కన్వీనర్ రెడ్డి అప్పలనాయుడు బీజేపీ పక్షనేతలతోనూ పరస్పర సమన్వయానికి చేరువఅయ్యారు. దీంతో అధికార వైసీపీకి గట్టిపోటీ ఇస్తున్నారు. దెందులూరు నియోజకవర్గం నుంచి చింతమనేని ప్రభాకర్, తనకు ఉన్న ఇమేజ్‌తో పార్టీశ్రేణుల సహకారంతో నియోజకవర్గమంతా కలియతిరుగుతున్నారు. పెదవేగి, దెందులూరు, పెదపాడు మండలాల్లో తనకు ఇంతకు ముందే ఉన్న పట్టును మరింత బలోపేతం చేసుకునే దిశగా ఎక్కడ అవసరమైతే అక్కడ వాలిపోతున్నారు. వైసీపీ ఇప్పటికే రకరకాల ఎత్తుగడలతో నియోజకవర్గంలో ప్రయత్నిస్తుండగా వాటిని తిప్పికొట్టడంలో ప్రభాకర్ ఇప్పటికే సక్సెస్ అయ్యారు. చింతలపూడి నియోజకవర్గం లోనూ ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ పట్టు బిగించారు. అందర్ని కలుపుకుని వెళుతూ మండలస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు పార్టీలో ఉత్తేజం పెంచే ప్రయత్నం చేస్తున్నారు. అధికార వైసీపీ మాత్రం స్థానికుల లుకలుక లతో సతమతమవుతోంది. ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేన, ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు ఇప్పటికే నియోజకవర్గం అంతటా సుడిగాలి పర్యటన చేశారు. ఈ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు బీజేపీ పక్షాన మాలతిరాణి ధర్మరాజుకు సహకారం అందిస్తుండగా వీరికి ఎంపీ అభ్యర్థి మహేష్ కుమార్ కూడా తోడయ్యారు. పోలవరంలో జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజును ఒడ్డు ఎక్కించేందుకు టీడీపీ పక్షాన బొరగం శ్రీనివాస్‌తో పాటు మరికొందరు నిరంతరం శ్రమిస్తున్నారు. రాష్ట్రనాయకత్వం ఆదేశించినట్టుగానే గీత దాటకుండా ఉమ్మడిగా కలిసి కట్టుగా ప్రయాణించడం ద్వారా ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభ్యర్థులు సరికొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు. వైసీపీ నుంచి అప్పుడప్పుడు ఎదురవుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడు తున్నారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించకుండా గీతదాటే వారిపై ఇలా ఫిర్యాదు చేయడం ద్వారా కొంతలోకొంత కట్టడి చేయడంలో సక్సెస్ అయ్యారు.

పెన్షన్ రాజకీయం



ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం

తెలుగుదేశంపైకి నెట్టే ప్రయత్నం

సచివాలయాల వద్ద ఇచ్చేందుకు ఏర్పాట్లు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఒకటో తేదీన వృద్ధులకు పెన్షన్‌లు పంపిణీ చేయడం లేదు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం మూడు రోజుల పాటు జాప్యం చేస్తోంది. ప్రతినెలా ఒకటో తేదీన పంపిణీ చేసేవారు. నిధులు కొరత ఉన్నప్పుడు మాత్రమే జాప్యం జరిగేది. త్వరలోనే ఎన్నికలు రావడంతో పెన్షన్‌లపై వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలను ఆపాదిస్తోంది. వలంటీర్ల ద్వారా పెన్షన్‌లు మంజూరు చేయకూడదని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దాంతో వైసీపీ ఉలిక్కిపడింది. వలంటీర్ల ద్వారా పెన్షన్‌లు ఇచ్చేందుకు తొలుత కసరత్తు చేశారు. అయితే ఎన్నికల సంఘం ఆదేశాలతో వెనక్కుతగ్గింది. ఇంటివద్ద కాకుండా సచివాలయాల్లో పెన్షన్‌లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఎన్నికల్లో వలంటీర్లను వైసీపీతన స్వప్రయోజనాలకు వినియోగించుకోవాలని భావించింది. సచివాలయ అడ్మిన్ల ద్వారా వలంటీర్లకు దిశానిర్దేశం చేసింది. ప్రభుత్వం కృతజ్ఞత చూపాలంటూ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సచివాలయ అడ్మిన్‌లు మౌఖిక ఆదేశాలిచ్చారు. పలువురు వలంటీర్లు వైసీపీ ప్రచారంలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. వేతనాలు ప్రభుత్వం ఇస్తోంది. అయితే వారంతా వైసీపీ తమ సొంతమన్నట్టు వ్యవహరించారు. జగన్‌మోహన్ రెడ్డే స్వయంగా వలంటీర్లు తమ కార్యకర్తలంటూ చెప్పుకొన్నారు. అప్పటినుంచి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు కూడా అదే తరహాలో వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని కొందరు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు వలంటీర్లతో సమావేశమవుతున్నారు. వైసీపీకి పనిచేయాలని సంకేతాలు పంపుతున్నారు. ప్రచారాల్లో పాల్గొన్న వలంటీర్లను అధికారులు సస్పెండ్ చేశారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని పెన్షన్‌ల పంపిణీలో వలంటీర్లకు దూరం పెట్టాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. దీనికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ రంగు పులుముతోంది. తెలుగుదేశం పార్టీ అడ్డుకుంటోందని వైసీపీ నేతలు దబాయిస్తున్నారు.

పెంచింది తెలుగుదేశంలోనే

పెన్షన్ పెంపు విషయంలో తెలుగుదేశం ముందడుగు వేసిందనే చెప్పాలి. 2014 కంటే ముందు రూ. 200 ఉన్న పెన్షన్‌ను రూ. 1000లకు పెంచింది. అదే 2019లో రూ. 2 వేలు చేసింది. దానిని రూ. 3 వేలు చేసేందుకు వైసీపీ ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టింది. అయితే తెలుగుదేశం కూటమి అధికారంలోకి వస్తే పెన్షన్‌ను రూ.4 వేలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. బీసీలకు రూ. 50 సంవత్సరాలకే పెన్షన్ ఇస్తామంటూ ప్రకటించారు. ఇలా పెన్షన్ విషయంలో ప్రతీసారి తెలుగుదేశం ఒక అడుగు ముందుకే వేస్తోంది. వైసీపీ ప్రభుత్వం మాత్రం పెన్షన్‌లను తామే ఇస్తున్నట్టు గొప్పలు చెప్పుకుంటోంది.

రాజకీయ రాజీనామాలు

వైసీపీకి అనుకూలంగా ఉండాలన్న ఉద్దేశంతో కొందరు వలంటీర్లు రాజీనామాలు చేస్తున్నారు. తమ రాజీనామా పత్రాలను అధికార పార్టీ ఎంఎల్‌ఎలకు సమర్పిస్తున్నారు. నిజంగా రాజీనామాలు చేసినట్టయితే సదరు పత్రాలను అధికారులకు సమర్పించాలి. అలా కాకుండా ఎమ్మెల్యేలకు సమర్పించి రాజకీయాలకు తెరలేపుతున్నారు. దానికి అధికార పార్టీ ఎమ్మెల్యేలు వత్తాసు పలకుతున్నారు. వలంటీర్లను తెలుగుదేశం అడ్డుకుంటోందని ఆరోపణలు గుప్పిస్తున్నారు. భీమవరంలో ఆదివారం కొంత మంది వలంటీర్లు స్థానిక ఎమ్మెల్యేకు రాజీనామా పత్రాలు సమర్పించి రాజకీయాలతో సంబంధాలున్నట్టు నిరూపించుకున్నారు. ఆచంటలోనూ వలంటీర్లతో సమావేశాలు నిర్వహిస్తున్న సందర్భాలుంటున్నాయి. ఇలా ప్రజాధనాన్ని వేతనాలుగా తీసుకుంటూ అధికార పార్టీకి ప్రచార కార్యకర్తలుగా వలంటీర్లు వ్యవహరిస్తున్నారు.

ఇంటింటికీ పింఛన్ పంపిణీ లేనట్లే

సచివాలయాల్లో 3 నుంచి 8వ తేదీ వరకు పంపిణీ



ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఇప్పటివరకు గ్రామ/వార్డు వలంటీర్లు ఇంటింటికీ పింఛన్‌లు పంపిణీ చేసేవారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికలు అయ్యేవరకు వలంటీర్లను విధులకు దూరంగా ఉండాలని ఆదేశించింది. వలంటీర్లు ద్వారా ఎటువంటి పథకాలు, పింఛన్‌లు పంపిణీ చేయకూడదని స్పష్టం చేసింది. నగదు పంపిణీ పథకాలను ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా అమలు చేయాలని ఈసీ సూచించడంతో ఇప్పుడు ఇంటింటికీ పింఛన్ల పంపిణీ లేనట్లేనని చెబుతున్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఏలూరు జిల్లాలో పింఛన్‌లు పంపిణీ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. సచివాలయాల వద్దే సచివాలయ సిబ్బంది అందజేయనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 2.38 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. ప్రతినెలా వారికి రూ. 69 కోట్లు పెన్షన్ ఇస్తున్నారు. ఏలూరు జిల్లాలో 2 లక్షల 74 వేల మంది లబ్ధిదారులకు రూ.81 కోట్లు చెల్లించాల్సి ఉంది. వీరంతా సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోవాల్సి ఉంది. పింఛన్ల పంపిణీకి గ్రామీణ స్థాయిలో ఎంపీడీవోలు, పట్టణాల స్థాయిలో మున్సిపల్ కమిషనర్లు అథరైజేషన్ ఇస్తారు.

టీడీపీపై అభిమానం

పెళ్లి శుభలేఖపై పితాని, చంద్రబాబు, పవన్ ఫొటోలు



ఆచంట : తమ అభిమానాన్ని పెళ్లి కార్డు రూపంలో చూపడం ఈమధ్య కాలంలో ఒక ట్రెండ్‌గా మారింది. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటకు చెందిన టీడీపీ నాయకులు కారెం ప్రేమరాజు, నాగమణి దంపతుల కుమారుడు సంజయ్ వివాహం సోమవారం జరగనుంది. ఈ కుటుంబ సభ్యులు టీడీపీపై అభిమానాన్ని చాటుకున్నారు. పెళ్లికార్డుపై పితాని సత్యనారాయణ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫొటోలతో శుభలేక ముద్రించారు. పెళ్లికార్డుపై ఓటు ఫర్ టీడీపీ అంటూ పేర్కొనడం గమనార్హం. ఈ శుభలేఖ ను స్వయంగా కారెం ప్రేమరాజు, తనయుడు సంజయ్ పితానికి అందించారు. ప్రస్తుతం ఈ శుభలేఖ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

మావుళ్ళమ్మకు జిల్లా జడ్జి దంపతుల పూజలు

భీమవరంటౌన్, మార్చి 31 : మావుళ్ళమ్మ అమ్మవారిని ఆదివారం జిల్లా జడ్జి సి. పురుషోత్తంకుమార్ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. ఆదివారం ఆలయానికి వచ్చిన దంపతులు అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మినగేష్ శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి ఫొటో అందించారు.



జిల్లా జడ్జి పురుషోత్తంకుమార్‌కు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

6,7 తేదీల్లో జిల్లాస్థాయి భగవద్గీత పోటీలు

భీమవరం టౌన్, మార్చి 31 : శ్రీఉద్దరాజు ఆనందరాజు 44వ వర్ధంతి ఈనెల 13వ తేదీన పురస్కరించుకుని ఈనెల 6,7 తేదీల్లో ఆనంద గీతాయజ్ఞంలోని 108 భగవద్గీత శ్లోకాలు పఠన పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆనంద గ్రూప్ ఛైర్మన్ యూకే విశ్వనాథరాజు తెలిపారు. ఆదివారం జరిగిన ఫౌండేషన్ కమిటీ సమావేశంలో పోటీల పోసర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అన్ని వయస్సుల వారికి మూడు విభాగాలుగా.. ఐదు నుంచి పదేళ్ల వయస్సు వారు సబ్ జూనియర్స్‌గా 11 నుంచి 18 ఏళ్ల వయస్సు వారు జూనియర్స్‌గాను, 18 ఏళ్లు పైబడిన వారందరూ సీనియ ర్స్‌గా విభజించి పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మా కమిటీ ఎంపిక చేసిన 108 శ్లోకాలనే పాడాలని, ఆసక్తిగల వారు సంప్రదిస్తే పీడీఎఫ్ ద్వారా శ్లోకాలు పంపిస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ భగవద్గీత రావాలని, ప్రతీ ఇంట భగవద్గీత వుండాలని ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఈనెల13వ తేదీన నిర్వహించే సభలో సర్టిఫికెట్, భగవద్గీత పుస్తకం అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.



ఆనంద గీత యజ్ఞం పోటీల పోస్టర్ ఆవిష్కరించిన దృశ్యం

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి 5 వరకు గడువు

టి.నరసాపురం, మార్చి 31 : ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి ఈనెల 5వ తేదీ వరకు పొడిగించినట్టు ఆ పాఠశాలల ఏలూరు జిల్లా కన్వీనర్, అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డీఎస్‌బీ శంకరరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో యాభై పాఠశాలలు, పది జూనియర్ కళాశాలలు, ఒక డిగ్రీ కళాశాల,(సాధారణ, మైనారిటీ) మొత్తం 61 విద్యాలయాలు నడపబడుతున్నాయన్నారు. ఈ పాఠశాల, కళాశాలల్లో ఖాళీలు నింపుటకు ఏప్రిల్ 25న పాఠశాల విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కేంద్రంలో పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తులు ఈనెల 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ద్వారా పాఠశాల విద్యార్థులు రూ.100, కళాశాల విద్యార్థులు రూ.300 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న తిరుమలరావు
సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

'తిరుమల'లో అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్,మార్చి 31: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని విద్యాసంస్థల ప్రాంగణంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించినట్టు తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. తల్లిదండ్రులు పిల్ల భవిష్యత్ గురించి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని, వారు మానసికంగా, శారీరకంగా కూడా దృఢంగా ఉండేవిధంగా సన్నద్ధం చేయాలన్నారు. జేఈఈ (మెయిన్స్, అడ్వాన్స్), నీట్ పరీక్షల్లో తరచుగా విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాల కన్నా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు ఎక్కువగా అలవాటు పడ్డారని, వారు మొబైల్‌తో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టాన్ని తల్లిదండ్రులు వివరించాలని చెప్పారు. విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినిదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు డాక్టర్ అశుతోష్ ప్రసాద్, డాక్టర్ లత, ఎం.రామకృష్ణ, జీవీ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నేరస్థులకు పోలీసుల కౌన్సెలింగ్

గణపవరం, మార్చి 31:సార్వత్రిక ఎన్నికల్లో గంజాయి వంటి మాదక ద్రవ్యాల జోలికి వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిడమర్రు సీఐ ఎంవీ. సుభాష్ హెచ్చరించారు. మండలంలో గంజాయి కేసుల్లో పట్టుబడిన పాత నేరస్థులను పోలీస్‌స్టేష న్‌కు పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల సమయంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటా మని, శాంతియుత వాతావరణంలో ఉండాలని సీఐ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశ్వరరావు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

డేంజర్ స్పాట్..

ప్రమాదాలకు నెలవుగా ఘాట్‌రోడ్డు కూడలి

- తగినన్ని స్పీడ్ బ్రేకర్లు లేని వైనం
- పట్టించుకోని ట్రాఫిక్ సిబ్బంది



శ్రీవారి ఘాట్‌రోడ్డుకు వెళ్లే వై.జంక్షన్

వైజంక్షన్ వైపునకు వస్తున్న వాహనాలకు ఆర్చిగేటు వద్ద స్పీడ్ బ్రేకర్లు లేని వైనం

వైజంక్షన్ వద్ద గందరగోళంగా వాహనాల రాకపోకలు

ద్వారకాతిరుమల, మార్చి 31: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం కొండపైకి వెళ్లే ఘాట్‌రోడ్డు కూడలి ప్రమాదాలకు నెలవుగా మారింది. వై.జంక్షన్‌గా వున్న ఆర్చిగేటు ప్రాంతంలో దాదాపు నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. వేగంగా వస్తున్న వాహనాలు ఎదురెదురై అదుపుతప్పి ఢీ కొట్టుకుంటున్నాయి. స్థానిక ఆర్చిగేటు మీదుగా నిర్మించిన ఘాట్‌రోడ్డులో తగినన్ని స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులవుతున్నారు. శ్రీవారి దర్శనానికి వస్తున్న భక్తులు.. ఆర్చిగేటు ప్రాంతంలో తగినన్ని స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. క్షేత్రానికి వాహనాలపై వచ్చే భక్తులు ఆర్చిగేటు మీదుగా దేవస్థానం నిర్మించిన ఘాట్‌రోడ్డు వెంబడి చేరుకోవాల్సి ఉంటుంది. వాహనదారులు ఆర్చిగేటు సమీపానికి వచ్చేసరికి గుడిసెంటర్ నుంచి దేవస్థానం హైస్కూల్ మీదుగా ఏలూరు వైపు వెళ్తున్న వాహనాలు రోడ్డు పల్లంగా ఉండడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న వాహనాలను ఒక్కోసారి ఢీకొడుతున్నాయి. శ్రీవారి దర్శనం చేసుకుని క్షేత్రం నుంచి వెళుతున్న భక్తులు ఆర్చిగేటులో నుంచి వచ్చే వాహనాలను, అదేవిధంగా పాతబస్టాండ్ నుంచి ఏలూరు వైపు వెళ్లే వాహనాలను గుర్తించలేకపోతున్నారు. దీంతో కొన్ని సందర్భాలలో మూడు వాహనాలు ఒకేసారి ఎదురై ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో వన్‌వేను తెలిపే విధంగా బోర్డులు లేవు. ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బంది లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు పూర్తిస్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాలను గుర్తించి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

స్పందనలో ఫిర్యాదుకు స్పందన లేదు..



ఈ సమస్యపై ఇప్పటికే స్పందనలో ఫిర్యాదు చేశా.. స్పీడు బ్రేకర్లు వేసేందుకు చర్యలు శూన్యం. ఈ సమస్యపై సీఎం స్పందించినట్టు వాయిస్ రికార్డు ద్వారా అధికారులు వినిపించి క్లోజ్ చేశారు. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వై.జంక్షన్ వద్ద మూడు వైపుల నుంచి వచ్చివెళ్లే వాహనాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పీడు బ్రేకర్లు తగినన్ని లేవు. సూచికబోర్డులు లేవు వాటిని ఏర్పాటు చేయాలి.

- గోపు కిరణ్, ద్వారకాతిరుమల

ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలి



నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ఉండడం లేదు. వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు అతిక్రమించి ఇష్టానుసారంగా ప్రయాణించడంతో సమస్య తలెత్తుతుంది. ఇప్పటికైనా క్షేత్రంలోని ముఖ్యకూడళ్లలో సిబ్బందిని నియమించాలి.

- పెద్దిరెడ్డి త్రిమూర్తులు, ద్వారకాతిరుమల

బస్టాండ్ వాష్‌రూమ్‌లో నీరులేక మూత

ద్వారకాతిరుమల, మార్చి 31: ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి పరిధిలోని భీమడోలు బస్టాండ్ మరుగుదొడ్లలో నీరులేక అవి మూతపడ్డాయి. అటు భక్తులు, ఇటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ నిత్యం ముఖ్యంగా శని, ఆది వారాల్లో శ్రీవారి క్షేత్రానికి వచ్చే భక్తులు ఈ బస్టాండ్ నుంచే వెళ్తుంటారు. ఇంత రద్దీగా ఉండే బస్టాండ్‌లో ప్రయాణికుల కనీస అవసరాలను తీర్చేలా నీరు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యంగా స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్లకు నీటిసదుపాయాన్ని మెరుగుపర్చాలని కోరుతున్నారు.



భీమడోలు బస్టాండ్‌లో నీరులేదన్న బోర్డు

వివక్ష మాని.. దాహం తీర్చండి

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన
- టీడీపీ వార్డు అరుంధతి కాలనీలో తాగునీటి కష్టాలు
- రెండేళ్లుగా నీటి సరఫరాపై పట్టించుకోని సర్పంచ్
- ఎమ్మెల్యే హామీకి దిక్కులేని పరిస్థితి

ముసునూరు, మార్చి 31 : తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తిని వార్డు సభ్యుడిగా గెలిపించుకోవడమే ముసునూరు మండలం రమణక్కపేట, అరుంధతి కాలనీ వాసులకు శాపమైంది. ఫలితంగా గొంతు నింపుకునేందుకు గుక్కెడు నీళ్ల కోసం రెండేళ్లుగా పొలాల్లో ఉన్న మోటార్ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీనిపై ఎన్నికల ప్రచారానికి వచ్చిన నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును కాలనీవాసులు నిలదీశారు. 24 గంటల్లో మీ సమస్య పరిష్కరిస్తానని ఇచ్చిన హామీ కూడా నాలుగు రోజులు గడిచినా నెరవేరలేదు. ఫలితంగా రమణక్కపేట అరుంధతి కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ప్రాంతం చూడం, కులం చూడం, మతం చూడం, రాజకీయాలు అసలే చూడమంటూ ఓ పక్క సీఎం జగన్ చెబుతుంటే స్థానిక వైసీపీ సానుభూతిపరుడైన సర్పంచ్ మాత్రం తమకు తాగునీరు కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తూ వివక్ష చూపుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు కాలనీకి తాగునీరు అందించేలా చర్యలు చేపట్టకపోతే ఎంపీడీవో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.



ఖాళీ బిందెలతో రమణక్కపేట అరుంధతినగర్ మహిళల ఆందోళన

వివక్ష చూపుతున్న సర్పంచ్



అరుంధతినగర్‌లో 11వ వార్డు టీడీపీ అనుకూల అభ్యర్థి గెలిచారు. రెండేళ్ల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా సర్పంచ్ మాత్రం వివక్షత చూపుతున్నారు. సంబంధిత అధికారులకు సమస్యపై వినతి పత్రాలు అందజేసినా నేటికీ పట్టించుకున్న వారు లేరు. ఎమ్మెల్యేకి పలుమార్లు నీటి సమస్యపై తెలిపాం. సమస్య పరిష్కరిస్తానని చెప్పి ఏడాదైనా సమస్య యథివిధిగా ఉంది. ఇటీవల కాలనీలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యేను నిలదీయగా, రెండురోజుల్లో సమస్య పరిష్కరిస్తానని చెప్పి హామీ ఇవ్వగా నాలుగురోజులు పూర్తవుతున్నా ఎటువంటి చర్యలు లేవు.

- నందిపాం సత్యరాజు, రమణక్కపేట, 11వ వార్డు సభ్యుడు

రెండేళ్లుగా నరకం చూస్తున్నాం..



అరుంధతినగర్‌లో తాగునీరు లేక రెండేళ్ల నుంచి నరకం చూస్తున్నాం. నీటికోసం చుట్టుపక్కల ఉన్న పంటపొలాల్లో మోటార్ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. పంచాయతీ పాలకులు, అధికారులు అరుంధతీ నగర్‌పై వివక్ష చూపుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు నీటి సమస్యను పరిష్కరించాలి.

- ఆముదాల శిరీష
రమణక్కపేట, అరుంధతినగర్ కాలనీవాసి



ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ ప్రాంగణంలో భక్తులు

వెంకన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, మార్చి 31:ద్వారకాతిరుమల శ్రీవారి దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అందరికీ సెలవు రోజు కావడంతో పాటు తిథి మంచిది కావడంతో ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. ఆలయం లోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. దాదాపు 15 వేల మంది భక్తులు వచ్చినట్టు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. శ్రీవారి దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది. మధ్యాహ్నం నుంచి రద్దీ తగ్గుముఖం పట్టింది. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

భూహక్కు చట్టం రద్దు చేసేవరకు పోరాటం

ఏలూరు క్రైం, మార్చి 31 : రాష్ట్రంలో భూ యాజమాన్య హక్కుల చట్టం రద్దు జరిగే వరకూ ఆలిండియా లాయర్స్ యూనియన్ పోరాడుతుందని యూనియన్ జాతీయ కార్యనిర్వహణ అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఏలూరు సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఆలిండియా లాయర్స్ యూనియన్ కమిటీ సమావేశం కెంగర కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలిండియా న్యాయవాదులు ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు చేసి సాధించిందన్నారు. రాష్ట్రంలో ఉన్న 531 కోర్టుల పరిధిలో కనీస సౌకర్యాలు లేక కక్షిదారులు, న్యాయవాదులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోర్టులలో న్యాయమూర్తులు, ఉద్యోగ నియామకాలు జరుగక ఖాళీలు ఉండడం వల్ల ప్రజలకు న్యాయం అందించడంలో ఆలస్యం జరుగుతుందన్నారు. వీటి పరిష్కారానికి ఐలూ కృషి చేస్తుందన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు మాట్లాడుతూ దేశంలోని న్యాయవ్యవస్థను భయపెట్టాలని కొంతమంది న్యాయవాదులు, రాజకీయ నాయకులకు లోబడి దేశంలోని ప్రధాన న్యాయమూర్తికి లెటర్ రూపంలో పంపడం సరైనది కాదన్నారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఐలూ అధ్యక్షుడు కొట్టు సత్యనారాయణ, ఏపీ ఐలూ గౌరవ అధ్యక్షుడు దిగుపాటి రాజ్‌గోపాల్, ఏపీ హైకోర్టు ఐలూ అధ్యక్షుడు నర్రా శ్రీనివాస్, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విశ్రైలజ, కామన మునిస్వామి, సభ్యులు గెద్ద విజయభాస్కర్, పుత్సల వెంకట్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం

ముగ్గురి నుంచి రూ.2.02 లక్షలు నగదు స్వాధీనం

కామవరపుకోట, మార్చి 31 : స్థానిక కొత్తూరులోని ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్‌లో అధికారులు, పోలీసులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్టు వద్ద ఆదివారం ముగ్గురు వ్యక్తుల నుంచి 2.02 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్టు తహసీల్దార్ జీవీఆర్ రమేష్, డీటీ ఎం.డి. మొహిద్దీన్, ఎస్‌ఐ జయబాబు తెలిపారు. ఏలూరుకు చెందిన వ్యక్తి నుంచి రూ.52.900, పెద తాడేపల్లికి చెందిన వ్యక్తినుంచి రూ.62,700, కామవరపుకోటకు చెందిన వ్యక్తినుంచి రూ.86.400 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు చెందిన సత్యవేణికి అందజేశారు. తడికలపూడి ఎస్‌ఐ జయబాబు, కె. రామకృష్ణ, జి.సూర్యారావు, ఏఎస్‌ఐ వీరాస్వామి, నాగార్జున, షేక్ నాగూర్‌సాహెబ్, మధు, సాయి తదితరులు పాల్గొన్నారు.



కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్టు వద్ద అధికారులు, పోలీసులు

జీలుగుమిల్లిలో రూ.95వేలు సీజ్

జీలుగుమిల్లి, మార్చి 31 : జీలుగుమిల్లిలో ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద రూ.95వేలు నగదు తహసీల్దారు ఆర్‌వి.వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఎన్నికల తనిఖీల్లో భాగంగా హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న ఐషర్ వ్యాన్ డ్రైవర్‌ను ఆపి పోలీసులు తనిఖీ చేశారు. డ్రైవర్ మహ్మద్ రఫీ వద్ద ఎటువంటి ఆధారాలు లేని రూ.95వేలు నగదు గుర్తించారు. కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్న నగదు ప్రభుత్వ ఖజానాకు అప్పగించనున్నట్టు ఎన్నికల మండల అధికారి ఆర్‌వీ వెంకటేశ్వరావు తెలిపారు. చెక్‌పోస్టు సూపరింటెండెంట్ ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ బి.సత్యనారాయణ, వీఆర్వో రాజు ఉన్నారు.


క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆకివీడు, మార్చి 31: విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. గుమ్ములూరుకు చెందిన పంతగాని యోహాన్(55) గత నెల మార్చి 27న ఆకివీడు నుంచి గుమ్ములూరు వైపు మోటారు సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా మరో మోటారు సైకిల్‌పై ఓ వ్యక్తి వేగంగా వచ్చి ఢీ కొనడంతో తీవ్ర గాయాలవ్వడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి యోహాన్‌ను తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. యోహన్ బావ వెంకటేష్ ఫిర్యాదు మేర ఎస్‌ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడితో లేగదూడ మృతి

పోలవరం, మార్చి 31 :వీధికుక్కల దాడిలో లేగదూడ మృతి చెందిన ఘట నపోలవరం మండలం పట్టిసీమ పంచాయతీ బంగారమ్మపేటలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన సరిమిల్లి భద్రం అనే పాడి రైతుకి చెందిన లేగదూడను వీధి కుక్కలు చంపి కొంతమేర తిని స్థానికలు బెదిరించడంతో వదిలి వెళ్లాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఊరకుక్కల సంతతి పెరిగిందని, రోడ్డుకి ఇరువైపులా ఇటీవల వెలసిన మాంసం దుకాణాల వద్ద ఆ దారిన వెళ్లే పాడి పశువులు, పెరటి కోళ్లను చంపుకు తింటున్నాయి. ఒక్కోసారి చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు, వాహనాలపై వెళ్లేవారిపై దాడులకు పాల్పడుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. మాంసం దుకాణాలను పోలవరం మార్కెట్‌లోకి తరలించేలా చర్యలు తీసుకోవాలని, ఈ విషయంపై ఎన్నోసార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



దూడ కళేబరం

బీరు బాటిళ్లు స్వాధీనం.. ఒకరిపై కేసు

ఏలూరు క్రైం, మార్చి 31 : బీరు బాటిళ్ల కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించడానికి తీసుకువెళ్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు పడమరవీధి రాజాబత్తుల నాగసాయికిరణ్ పది బీరు బాటిళ్లను అధికధరలకు విక్రయించడానికి నగరంలో ఆదివారం తీసుకువెళ్తున్నారు. ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద త్రీటౌన్ సీఐ వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అతడు చిక్కాడు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంగానమ్మ గుడి విగ్రహ ప్రతిష్ఠ వివాదం

- అధికారపార్టీ ఎంపీటీసీ తీరుపై దోసపాడు గ్రామస్థుల నిరసన

దెందులూరు, మార్చి 31 : దోసపాడులో గత వారం రోజులుగా అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీకి, గ్రామస్థులకు మధ్య వివాదం కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. వివరాలివి.. గ్రామస్థులందరూ చందాలు పోగుచేసుకుని ఊరులో గంగానమ్మగుడిని నిర్మించుకున్నారు. గతనెల రోజుల క్రితం గ్రామస్థులందరూ ఎంపీటీసీతో సహా ఏప్రిల్ ఒకటిన అమ్మవారి ఊరేగింపు, తదితర కార్యక్రమాలకు ముహూర్తం ఖరారు చేసుకుని ఏర్పాట్లు చేసుకు న్నారు. ఈ క్రమంలో ఎంపీటీసీ తల్లి మృతి చెందడంతో గ్రామస్థులను కలిసి విగ్రహ ప్రతిష్ఠను నిలుపుదల చేయాలని కోరారు. ముహూర్తం పెట్టిన వేదపండితుల సలహాతో ముందుకు వెళదామంటూ వేదపండితులకు విష యం తెలుపగా ముహూర్తం పెట్టిన తరువాత ఆగితే గ్రామానికి కలిసి రాద ని సూచించడంతో విగ్రహ ప్రతిష్ఠ చేసేందుకు నిర్ణయించారు. దీనిపై ఆగ్రహించిన ఎంపీటీసీ తాను లేకుండా విగ్రహ ప్రతిష్ఠ చేయడం కుదరదన్నారు. ఎంపీటీసీ, గ్రామస్థులు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులతో గ్రామస్థులు మాట్లాడుతూ వేదపండితుల సూచనల మేరకు చనిపోయిన వారి పేరుమీద ముహూర్తం పెట్టలేదు కావున విగ్రహ ప్రతిష్ఠ చేసుకోవాలని సూచించారని తెలిపారు. ఈక్రమంలో ఆదివారం ఎంపీటీసీ గంగానమ్మ గుడి వద్దకు వచ్చి తాము లేకుండా విగ్రహ ప్రతిష్ఠ వద్దని, వాయిదా వేయాలని అనడంతో గ్రామస్థులకు ఎంపీటీసీ అనుచరులకు వివాదం జరిగింది. దీంతో గ్రామస్థులు అధిక సంఖ్యలో దెందులూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎంపీటీసీపై ఫిర్యాదు చేసి ఆందోళన చేశారు. పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఎంపీటీసీ వినకపోవడంతో వాయిదా వేసుకోవాలని పోలీసులు గ్రామస్థులు సూచించారు. ఈ వివాదం కొనసాగుతుండడంతో సోమవారం ఉదయం అమ్మవారి ఊరేగింపు సమయంలో ఇరువర్గాల మధ్య ఎటువంటి సమస్యలు తలెత్తుతాయో వేచి చూడాలి.



దెందులూరు పోలీస్‌స్టేషన్ వద్ద దోసపాడు గ్రామస్థుల నిరసన

ఫార్మాసిస్టు అదృశ్యం

ఏలూరు క్రైం, మార్చి 31 : ఒక మెడికల్ షాపులో పనిచేస్తున్న ఫార్మాసిస్టు అదృశ్యమైందని ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏలూరు టూటౌన్ పోలీసులు తెలిపారు. ఏలూరు గన్‌బజార్‌కు చెందిన రుద్ర నీలిమ ఆర్‌ఆర్‌పేటలోని ఒక మెడికల్ షాపులో ఫార్మాసిస్టుగా పనిచేస్తుంది. ఈనెల 30వ తేదీ ఉదయం నుంచి ఆమె కనిపించడంలేదని ఆమె తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జూనియర్ డాక్టర్ మోసాలు

- నమ్మకంగా వైద్యం చేస్తూ మత్తు మందు ఇచ్చి ఆపై ఇంటిని దోచేయడం
- మత్తు వికటించి మృతి చెందిన రిటైర్డ్ ఉద్యోగి
- డాక్టర్‌పై హత్య, దొంగతనం కేసుల నమోదు

ఏలూరు క్రైం, మార్చి 31 : వైద్యవృత్తిలో ఉన్న ఓ వైద్యుడు ఒక రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగికి ఇంజక్షన్ చేసి హతమార్చాడు. ఆపై ఆ ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు అపహరించుకుపోయాడు. సహజ మరణమని భావించిన కుటుంబ సభ్యులు అంత్యక్రియలు జరిపారు. కొంతకాలానికి ఆ డాక్టర్ ప్రవర్తనపై అనుమానం కలగడంతో బాధితులు ఆ వైద్యుడే హతమార్చాడంటూ ఏలూరు రూరల్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయడంతో ఆ వైద్యుడిపై దొంగతనం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. పోస్టల్‌శాఖలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన బత్తిన మల్లేశ్వరరావు(63) ఏలూరు రూరల్ మండలం చొదిమెళ్ళలో సొంత నివాసంలో ఉంటున్నారు. తన మేడ మొదటి అంతస్తులో తన కుమారుడు సోమేశ్వరరావు కుటుంబం నివాసం ఉంటున్నారు. మల్లేశ్వరరావు ఒక్కరే కింద నివాసం ఉంటున్నారు. అనారోగ్యం చేసినప్పుడల్లా ఏలూరులోని చైత్ర ఆసుపత్రికి తీసుకువెళ్ళేవారు. అక్కడ జూనియర్ డాక్టర్‌గా ఉన్న చొదిమెళ్ళ ప్రాంతానికి చెందిన డాక్టర్ కొవ్వూరి భానుసుందర్ వారికి పరిచయమయ్యాడు. ఏదైనా ఇబ్బంది అనిపిస్తే తానే ఇంటికి వస్తానని నమ్మబలికాడు. తరచుగా వస్తూ ఇంజక్షన్లు చేస్తూ ఉండేవాడు. మల్లేశ్వరరావు ఒంటరిగా జీవించడం ఆయన వద్ద బంగారం, నగదు ఉండడాన్ని గమనించాడు. చివరకు డాక్టర్ భానుసుందర్ గత ఏడాది డిసెంబరు 24వ తేదీన మల్లేశ్వరరావు ఇంటికి వచ్చి ఇంజక్షన్ చేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే ఏడుంపావు కాసుల బంగారు వస్తువులు, కొంత నగదు అపహరించుకుని వెళ్ళిపోయాడు. మల్లేశ్వరరావుది సహజ మరణమేనని భావించి కుమారుడు బత్తిన సోమశేఖర్, బంధువులు కలిసి అంత్యక్రియలు నిర్వహించారు. ఆ తరువాత ఆ వైద్యుడిపై ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో మూడు కేసు నమోదు కాగా, ఏలూరు వన్‌టౌన్‌లో ఒక కేసు నమోదైంది. అతడు నమ్మకంతో వైద్యం చేస్తానని ఇళ్లకు వచ్చి మత్తు ఇంజక్షన్ ఇచ్చి ఆపై ఇంట్లో విలువైన ఆభరణాలు, నగదు అపహరించుకుపోతూ ఉంటాడని ఫిర్యాదులో నమోదయ్యాయి.

ఈ ఘటనలతో వైద్యుడిపై అనుమానం కలిగి సోమశేఖర్ అతడిని ప్రశ్నించడానికి ప్రయత్నించగా అప్పటినుంచి పరారీలో ఉన్నాడు. అతడి తల్లిదండ్రులు రాజీకి రావడంతో అతడే తన తండ్రిని ఇంజక్షన్ చేసి హత్య చేశాడని ప్రాథమికంగా నిర్ధారణ చేసుకున్నారు. ఏలూరు రూరల్ పోలీసులకు బత్తిన సోమశేఖర్ ఫిర్యాదు చేయడంతో రూరల్ ఎస్‌ఐ కె.రాజారెడ్డి ఆదివారం కేసు నమోదు చేశారు. డాక్టర్ కొవ్వూరి భానుసుందర్‌పై హత్యా కేసు, దొంగతనం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న డాక్టర్ భానుసుందర్ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.

ఘనంగా మడుగు మహాలక్ష్మమ్మ జాతర



పోడూరు, మార్చి 31: జిన్నూరు మడుగు మహాలక్ష్మమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. తీన్మార్ డప్పులు, బుట్టబొమ్మలు, కాళికామాత వేషాధారణ, బాణసంచా కాల్పుల మధ్య అమ్మవార్ల ఘటాలు ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. చలివిడి పానకాలతో దూపదీప నైవేద్యాలు చెల్లించారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

వేడుకగా దేశాలమ్మ జాతర



అమ్మవారికి చీర, సారె అందిస్తున్న భక్తులు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 31: మండలంలోని కుంచనపల్లిలో గ్రామదేవత దేశాలమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు చీర, సారెతో మొక్కులు తీర్చుకోవడంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సుంకర సూర్యనారాయణ, సోమా ప్రకాశరావు, గుమ్మళ్ల గంగరాజు, సోమ శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

ముగిసిన శ్రీమూలస్థానేశ్వరి జాతర



యలమంచిలి, మార్చి 31: శ్రీమూలస్థానేశ్వరి అమ్మవారి జాతర ముగింపు సందర్భంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో 36 మంది ముత్తయిదువులు పాల్గొన్నారు. అమ్మవారికి చీరలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణ చేశారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం సుమారు ఐదువేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. తాళ్లూరి బుజ్జిబాబు, ఆలయ కమిటి సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

నరసాపురం టౌన్, మార్చి 31: చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. ఆదివారం పట్టణంలోని 25వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన అనేక హామీలు నేరవేర్చామన్నారు. మళ్లీ గెలిపిస్తే పెండింగ్‌లో ఉన్న పనులన్నింటిని పూర్తి చేస్తానన్నారు.

జవహర్ నవోదయకు ముగ్గురు ఎంపిక

ఆచంట, మార్చి 31: 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఇటీవల జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో కొడమంచిలి హోలి ఏంజెల్స్‌కు చెందిన కుంపట్ల జయశ్రీ, కుడిపూడి జాహ్నవి, కాండ్రేగుల ఫణీంద్ర సీట్లు పొందారని స్కూలు కరస్పాండెంట్ కుక్కల రవి కుమార్ తెలిపారు. స్కూలు యాజమాన్యం విద్యార్థులను అభినందించారు.

లోటస్‌లో గ్రాడ్యుయేషన్ డే



చిన్నారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న రాజేష్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 31: మండలంలోని పెదతాడేపల్లి లోటస్ హైస్కూల్‌లో శనివారం రాత్రి గ్రాడ్యుయేషన్ డే ఆకట్టుకుంది. చిన్నారులు ఫ్యాన్సీ డ్రెస్‌లు, పోలీస్, డాక్టర్ వేషధారణలు ఆకట్టుకున్నాయి. స్కూల్ కరస్పాండెంట్, సెక్రటరీ బొలిశెట్టి రాజేష్ చిన్నారులకు సర్టిఫికెట్లు అందించారు. ప్రిన్సిపాల్ దేవి ప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హుస్సేన్

తణుకు, మార్చి 31: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా ఇంటికే పరిమితమైన వృద్ధులకు ఆదివారం డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్ర తణుకు, సజ్జాపురం, పాతూరు, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి 8 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించారు. వేల్పూరుకు చెందిన పుట్టా వెంకట చక్రధరరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, కోశాధికారి అర్తి భాస్కరరావు, జి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వల్లి మోహన్ సంస్థ వితరణ

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 31: తాడేపల్లిగూడెం మండలం ఎల్. అగ్రహారంలోని రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్‌ల వద్ద వల్లి మోహన్ సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం వృద్ధులకు నిత్యావసర వస్తువులు, బియ్యం, ఆయిల్ ప్యాకెట్‌లు అందించారు. సంస్థ అధ్యక్షుడు పఠాన్ వల్లి, ప్రధాన కార్యదర్శి గొల్లేరు మోహన్, గౌరవ అధ్యక్షుడు ఉండ్రాజవరపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వైర్‌లెస్ మైక్‌సెట్ బహూకరణ

గణపవరం, మార్చి 31: జల్లికొమ్మర ప్రీహైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రూ. 20 వేలు విలువ గల వైర్‌లెస్ మైక్‌సెట్‌ను పాఠశాలకు బహూకరించారు. 2022-23లో ఎనిమిదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు, ప్రస్తుతం 2023-24 విద్యాసంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు కలిసి ఈ మైక్‌సెట్‌ను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైనిక శిక్షణతో అన్ని రంగాల్లో రాణింపు



అలంపురంలో సైనిక శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విశ్రాంత జీఎం బీవీ రావు



పెంటపాడు, మార్చి 31: సైనిక శిక్షణ తీసుకుంటే అన్ని రంగాల్లోనూ రాణించవచ్చునని విశ్రాంత జనరల్ మేజర్ బీవీ రావు అన్నారు. ప్రత్తిపాడు జాతీయ రహదారి జంక్షన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్లో నేషనల్ డిఫెన్స్ అకాడమి (ఎన్‌డీఏ) శిక్షణా కేంద్రాన్ని బీవీ రావు ఆదివారం ప్రారంభించారు. ఇండియన్ ఎయిర్స్ ఫోర్స్ విశ్రాంత గ్రూప్ కెప్టెన్ ఐబీఆర్ రావు, నేవీ విశ్రాంత కమాండర్ భరత్‌భూషణ్ మాట్లాడుతూ మిలటరీలో పనిచేయడం ఒక అద్భుతమన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంస్థ చైర్మన్ తనుబుద్ది భోగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది స్కూల్లో ఇంటర్‌మీడియట్ వరకూ విద్యాబోధన పెంచి మిలిటరీ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. కరస్పాండెంట్ పద్మావతి, డైరక్టర్ రవికిరణ్, ప్రిన్సిపాల్ పర్వీన్‌కుమారి శర్మ, హెచ్ఎం కళ్యాణి, ఏవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో 'మానవత' ముందు

పెంటపాడు, మార్చి 31: సేవలందించడంలో మానవత ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని ఎంఈవో-2 టీవీ రామకృష్ణ అన్నారు. మానవత మండల శాఖ సమావేశం పెంటపాడులో సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహన్‌రావు నివాసంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత డైరీని ఆవిష్కరించారు. తారాడీపాల్, ఏలూరి వీరాస్వామి, వి.వినాయకుడు, ఎస్.రాము, వై.కేశవరావు, ఎన్.రామలింగం, వి. కృపారావు తదితరులు పాల్గొన్నారు.









పాలకొల్లు, పెంటపాడులలో సమాధుల వద్ద దీపాలు వెలిగిస్తున్న క్రైస్తవులు... కాళ్లలో ప్రార్థనలో పాల్గొన్న ఉండి స్వతంత్ర అభ్యర్థి శివరామరాజు.. ఉండి చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంతెన రామరాజు

ఈస్టర్ ప్రార్థనలు

క్రైస్తవ సమాధులకు అలంకరణ

ఆకివీడు, మార్చి 31: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఆదివారం తెల్లవారుజామున క్రైస్తవులు క్రీస్తు నేడు లేచెను అంటూ ర్యాలీగా సమాధుల దగ్గర కెళ్ళి కొవొత్తులతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుడ్ ఫ్రైడే రోజు శిలువ వేసిన తరువాత మూడవరోజు క్రైస్తవ విశ్వాసం బట్టి ఏసు లెచెను అను నమ్మకంతో సమాధులు అలంకరించి పార్థనలు చేశారు. అదే విధంగా అన్ని చర్చల్లో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. అనంతరం ప్రేమ విందు లు ఏర్పాటుచేసుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్ జోసఫ్‌రాజు, ఎం.నోబుల్, క్రైస్తవులు పాల్గొన్నారు. లోక రక్షకుడైన ఏసుక్రీస్తు భావాలను అందరూ ఆదర్శంగా తీసుకుని, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. ఆదివారం స్థానిక హోప్ బాప్టిస్ట్ చర్చిలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేసి మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలందరిపైన ఏసుక్రీస్తు దీవేనలు ఉండాలన్నారు.

కాళ్ళ: క్రీస్తు పునరుత్థాన వేడుకలు (ఈస్టర్) మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున సమాధులతోటలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాళ్లలో నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే శివరామరాజు పాల్గొన్నారు.

పాలకోడేరు: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని వేంద్ర గ్రామంలోని చర్చిలో మాజీ ఎమ్మెల్యే శివరామరాజు ప్రార్థనలు నిర్వహించి క్రైస్తవులకు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ ఏసు ప్రభువు ఆశీస్సులతో తాను ముందుకు వచ్చానని తనను ఆదరించాలని కోరారు. ఈయన వెంట భూపతిరాజు రామచంద్రరాజు, పెన్నాడ రఘువర్మ, సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ నేతల బేబి, శ్రీను, శివరామరాజు, తదితరులు ఉన్నారు.

భీమవరం రూరల్: ఈస్టర్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆదివారం పట్టణంలోని పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా బేతనిపేట చర్చి, లూథరన్ చర్చి, తాడేరు పెద్ద చర్చి, కల్వరి చర్చి, రూపాంతరదేవాలయాలను ఆయన దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నరసాపురం టౌన్: పట్టణ,మండలంలో ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామున సమాధుల వద్దకు వెళ్లి పూలతో అలంకరించి ప్రార్థనలు చేశారు. నూతన వస్త్రాల ధరించి ఒకరినొకరూ ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని బెతన్య, జీడీఎం, పెంతుకోస్తు మండలంలోని సరిపల్లి, కొప్పరు, సీతారాంపురం, రుస్తుంబాద, ఎల్‌బిచర్ల గ్రామాలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆచంట: క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే సమాధుల వద్దకు వెళ్లి సమాధులను అలంకరించి ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిం చారు.

ఉండి: నియోజకవర్గంలోని ప్రజలందరిని ఏసు ప్రభువు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మంతెన రామరాజు, నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివ రామరాజు, వైసీపీ అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు కోరారు. ఆదివారం ఈస్టర్ పండుగ పర్వదినం పురస్కరించుకుని నియోజకవర్గంలోని ఆయా గ్రామాలలోని చర్చిలకు వెళ్లి ప్రార్థనలలో పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: ఈస్టర్ పండుగ సందర్భంగా తాడేపల్లిగూడెం పట్టణం, మండలంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం తెల్లవారు జామున పెద్దల సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. పట్టణంలోని లూథరన్ చర్చి, మదర్ వన్నీని ప్రార్థనా మందిరంతోపాటు మండలంలోని కుంచనపల్లి, ఉప్పరగూడెం, పెదతాడేపల్లి, పడాల, కృష్ణాయపాలెం, నవాబుపాలెం, మాధవరం, మోదుగగుంట తదితర గ్రామాల్లో ప్రార్థనలు చేశారు.





భీమవరంలో ప్రార్థనలకు విచ్చేసిన బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి శ్రీనివాసవర్మ.. తణుకులో ప్రార్థనల అనంతరం టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లికి వినతి పత్రం అందిస్తున్న జగ్జీవన్‌రామ్ సంక్షేమ సంఘ నాయకులు

తణుకు: చెడు మీద మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈస్టర్ జరుపుకుంటున్నామని మాజీ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని పలు చర్చిల్లో ఈస్టర్ పండుగ సందర్భంగా జరిగే ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఆయనకు పాస్టర్‌లు ఆశీస్సులు అందజేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆరిమిల్లి కోరారు.

- పట్టణంలోని అరుంధతీపేట చర్చికి వచ్చిన ఆరిమిల్లికి బాబు జగ్జీవన్‌రామ్ యువజన సంక్షేమ సంఘ సభ్యులు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. మాదిగ శ్మశాన వాటికలో గొయ్యి తవ్వడానికి క్రేన్ ఏర్పాటు చేయాలని, ఆరోగ్య కేంద్రం, లైబ్రేరీ ఏర్పాటు, కమ్యూనిటీ హాలు పునర్నిర్మాణం చేయాలని వినతిలో పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం ప్రెసిడెంట్ సిర్రా బ్రహ్మయ్య, కోశాధికారి సుధాకర్ తదితరులు ఉన్నారు.

పెనుమంట్ర: లోక రక్షకుడు ఏసుక్రీస్తు శిలువపై ప్రాణాన్ని విడిచి మూడో రోజు పునరుత్థానుడై తిరిగి సమాధి నుంచి లేచినట్లు క్రైస్తవులు ఈస్టర్ పర్వదినాన్ని నిర్వహించుకున్నారు. వేకువ జామునే ఏసుక్రీస్తు సంకీర్తనలు పాడుతూ క్రీస్తు నేడు లేచెను హల్లెలూయ అంటూ గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. క్రైస్తవ శ్మశాన వాటికలకు వెళ్లి పూర్వీకుల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని చర్చిలు, సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 40 రోజుల ఉపవాస దీక్షను విరమించి ఎల్ఆర్‌పేట, శంభునిపేట, తదితర ప్రాంతాల్లో ఉన్న తమ పెద్దల సమాధుల వద్దకు వెళ్ళి కొవ్వొత్తులు, పూలమాలతో అలంకరించారు. అనంతరం ప్రేమ పూర్వక విందులను ఏర్పాటు చేసుకున్నారు.

పెనుగొండ: పెనుగొండలోని లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సుమారు 5వేల మందికి ప్రేమ విందును ఏర్పాటు చేశారు.

మొగల్తూరు: మొగల్తూరు ఆర్‌సీఎం చర్చిలో రెవరెండ్ ఫాదర్ పీటర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు మానవాళిని తమ పాపముల నుంచి రక్షించడానికి ఈలోకానికి వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో క్రైస్తవులు వారి పూర్వీకుల సమాధుల వద్ద పూలు చల్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గణపవరం: ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని పాస్టర్లు బోధించారు. ఆదివారం ఈస్టర్ పండుగ పురస్కరించుకుని క్రైస్తవులు చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. గణపవరం, సరిపల్లె, పిప్పర, అర్ధవరం, మొయ్యేరు, కేశవరం, జల్లికాకినాడ, తదితర గ్రామాల చర్చిలలో శనివారం అర్థరాత్రి నుంచి కొవ్వొత్తులు వెలిగించి ప్రభువుకు స్వాగతం పలికారు.

భీమవరం టౌన్: తెల్లవారుజామున రెస్ట్‌హౌస్ రోడ్డులోని సమాధుల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు. సమాధులను పూలతోను, విద్యుత్ దీపాలు, కొవ్వత్తులతో అలంకారం చేశారు. బైబిల్ పఠనం చేశారు. అనంతరం క్రైస్తవ దేవాలయాలైన రూపాంతర దేవాలయం, కల్వరీ దేవాలయం, ఆర్‌సిఎం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, నరసాపురం వైసీపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల చర్చిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస వర్మ యనమదుర్రు గ్రామ పంచాయతీకి చెందిన డేగాపురంలో చర్చిలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్నారు.

పెంటపాడు: ఈస్టర్ పండుగ సందర్భంగా ఆదివారం తెల్లవారు జామునే విశ్వాసులు తమ పూర్వీకుల సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.







నరసాపురంలో కూటమి నాయకులతో నాయకర్.. ఏనుగువానిలంకలో ఎమ్మెల్యే నిమ్మల ప్రచారం.. తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి ప్రచారం

చంద్రబాబుకు అండగా నిలవాలి: తోట

భీమవరం అర్బన్, మార్చి 31: అనుభవం, బాధ్యత ఉన్న నేతగా మన కోసం చేసే పోరాటంలో ప్రజలందరు చంద్రబాబుకి అండగా నిలవాలని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామ లక్ష్మీ కోరారు. శ్రీకాళహస్తిలో నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు తనను డ్రైవర్‌గా అభివర్ణించుకున్నారన్నారు. ప్రజలను రాతియుగం నుంచి స్వర్ణయుగం వైపు నడిపించే డ్రైవర్ చంద్రబాబు ఒక్కరేనన్నారు. జగన్ అసమర్థ అవినీతి పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. యువత భవితకు బాబు హామీ ఇచ్చారని యువకులంతా చంద్రబాబుతో కలిసి రావాలిని పిలుపునిచ్చారు.

అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుపుతా: ఎమ్మెల్యే నిమ్మల

యలమంచిలి, మార్చి 31: రాష్ట్రంలో పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలపడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఏనుగువానిలంక గ్రామంలో టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం ఎన్నికల ముందు మాత్రమే ప్రజల వద్దకు వచ్చే నాయకుల మాటలు విని మోసపోవద్దని అన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి కొవిడ్, వరదలు వంటి విపత్తుల కాలంలో ప్రజలకు అండగా తోడుగా సేవలందించిన తనకు ప్రజలు మరోసారి ఓటువేసి ఆశీర్వదించాలని కోరారు. గ్రామంలో పలుచోట్ల మహిళలు ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మలకు హారతులిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇనుకొండ రమేష్, శివ, కొడవటి ఫణి, కామిశెట్టి హరిబాబు, బి.చంటి, బల్ల రాజేష్, బి.దుర్గాప్రసాద్, పి.బాలాజీ, ఏడుకొండలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందరికి అందుబాటులో ఉంటా: నాయకర్

నరసాపురం రూరల్, మార్చి 31: గెలిపిస్తే మీ అందరికి అందుబాటులో ఉంటానని కూటమి అభ్యర్థి బొమ్మిడి నాయకర్ ప్రజలకు హామి ఇచ్చారు. ఆదివారం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలసి మండలంలోని ఎల్‌బీచర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈప్రాంతంలో పుట్టి పెరిగిన తనకు ప్రతి సమస్య తెలుసునన్నారు. తీర ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తానన్నారు. టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ వైసీపీ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు.

జనసేనలో చేరికలు

మండలంలోని చామకూరిపాలెం గ్రామానికి చెందిన సుమారు 100 మంది వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. వీరిలో కవురు రాంబాబు, కవురు శ్రీనివాస్, మాధ్రాజు, బొక్కా వెంకట్, రామ్మోహన్, యుగంధర్, నరసింహులు, కొండవీటి ప్రభాకర్‌రావు తదితరులు ఉన్నారు. వీరందరికి బొమ్మిడి నాయకర్ కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు.

జగన్‌కు ఓటడిగే హక్కులేదు : బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 31: గత ఎన్నికల హామీలు అమలు చేశానని అసత్యాలు వల్లిస్తున్న జగన్‌కు రాష్ట్రంలో ఓటడిగే హక్కులేదని ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేటలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీతో కలసి పల్లెపోరు నిర్వహించారు. బొలిశెట్టి మాట్లాడుతూ సంపూర్ణ మద్యపాన నిషేధం అమలుచేస్తానని చెప్పిన జగన్ కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని ముంచెత్తుతున్నాడని, గంజాయి మాఫియాని ప్రోత్సహించి యువత జీవితాలను నాశనం చేస్తున్నాడన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే రామరాజు, మోటుపల్లి ప్రసాద్ తదితరులు

బీసీల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం

ఆకివీడు రూరల్ మార్చి 31 : బీసీల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న పార్టీ టీడీపీ అని ఆముదాల వలస మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. కళింగగూడెంలో ఎమ్మెల్యే రామరాజు అధ్యక్షతన జరిగిన జయహో బీసీ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి బీసీ సంక్షేమమే అజెండాతో పనిచేసిందని అన్నారు. రాష్ట్రంలో 2.80కోట్ల మంది బీసీలు ఉన్నారని అన్నారు. బీసీలకు 50 సంవత్సరాలకే పింఛను తీసుకువస్తున్న ఘనత టీడీపీదేనని అన్నారు. జగన్ హయాంలో బీసీలకు ఇచ్చిన 29 పథకాలు, బీసీ సబ్‌ప్లాన్ రూ.75000కోట్లు రద్దు చేశాడన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించేశాడని అన్నారు. బీసీలే చంద్రబాబు శ్వాస అని ఎమ్మెల్యే రామరాజు అన్నారు. ప్రధానంగా బీసీలకు చట్ట సభలలో రిజర్వేషన్‌లు, రక్షణ చట్టం వారి అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు, సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్ దస్తావేజులపై సీఎం జగన్ ఫొటో ముద్రించడం దౌర్భాగ్యమని తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపతిరాజు తిమ్మరాజు అన్నారు. పార్టీ నాయకులు జుత్తిగ నాగరాజు, మోటుపల్లి రామవరప్రసాదు, దొంగకృష్ణ, కట్రెడ్డి ఏడుకొండలు, గొంట్లా గణపతి, జన్ను గోపి, బచ్చు సరళ, కట్టా రాంబాబు, బత్తుల రవి, నౌకట్ల రామారావు, బి సుజాత, శ్యామలా, కోపల్లె హనుమ పాల్గొన్నారు.

కూటమితోనే యువతకు భవిష్యత్

ఉండి, మార్చి 31: తెలుగుదేశం కూటమితోనే యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఉండి ఎమ్మెల్యే రామరాజు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీతోపాటు, యువతకు 20 లక్షలు ఉద్యోగాలు కల్పించే ప్రణాళికను చంద్రబాబు రచించారని ఆయన స్పష్టం చేశారు. ఉండి మండలంలో ఆదివారం 150 మంది యువత తెలుగుదేశంలో చేరారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జ్ జుత్తిగ నాగరాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీను, టీడీపీ అధ్యక్షుడు కాగితపు బుజ్జి పాల్గొన్నారు.



అధ్యక్షుడు చిర్లంచర్ల సుబ్రహ్మణ్యంకు నియామకపత్రం అందజేసి అభినందిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

జిల్లా ఆర్యవైశ్య కమిటీ ప్రమాణ స్వీకారం

పాలకొల్లు టౌన్, మార్చి 31: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఏపీఐఐసీ మాజీ చైర్మెన్ శివరామసుబ్రహ్మణ్యం అన్నారు. పాలకొల్లు గామస్ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఆయన మాట్లాడారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ అధ్యక్షుడుగా చిర్లంచర్ల సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా కందగట్ల రఘురామలు, అదనపు కార్యదర్శిగా మండవల్లి దుర్గారావు, అదనపు కోశాధికారిగా మండవల్లి వెంకయ్యతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారోత్సవ సభలో ఏపీ ఆర్యవైశ్య మహాజన సభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, కుసుమంచి సుబ్బారాయుడు, జయవరపు శ్రీరామ్మూర్తి, మాటూరి నర్సింహమూర్తి, కంచర్ల వెంకట్రావు, సాదు ప్రతాప్, కొనగళ్ల హరినాథ్ తదితరులు మాట్లాడారు.

అభివృద్ధి, సంక్షేమానికి అండగా నిలవండి

భీమవరం రూరల్, మార్చి 31 : భీమవరం నియోజకవర్గం అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అండగా నిలబడాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆదివారం కిరాణా మర్చంట్స్ వర్తకులను కోరారు. కిరాణా మర్చంట్స్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమవరం నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్న తనకు రానున్న ఎన్నికలలో ప్రజలు అండగా ఉండాలన్నారు. పట్టణంలో 24గంటలు పాటు త్రాగునీటి సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల, తోట భోగయ్య, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సభాపతి పాల్గొన్నారు.



వైసీపీ నుంచి చేరిన వారితో జనసేన నాయకుల

వైసీపీ నుంచి జనసేనలో చేరిక

భీమవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలోని 10వ వార్డులోని వైసీపీ సీనియర్ నాయకులు 10వ వార్డు అధ్యక్షుడు మింది అప్పనమూర్తి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు సుమారు 30 మంది జనసేనలో చేరారు. పార్టీ నాయకుడు మాగపు ప్రసాద్ నాయకత్వములో జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు), భీమవరం అసెంబ్లీ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్ర శేఖర్, ప్రధాన కార్యదర్శి సుంకర రవి, వార్డు సభ్యులు నూకరాజు, ఆరుగొలను పద్మ, బోనం శ్రీను, నాయకులు వానపల్లి సూరిబాబు, ఆకుల శ్రీను, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు సౌకర్యాలు కల్పిస్తాం

ఇరగవరం, మార్చి 31 : తణుకు పట్టణంలో వాకర్స్‌కు అన్ని సౌకర్యాలు కల్పిస్తానని సభ్యులెవ్వరూ డొనేషన్లు ఇవ్వక్కరలేదని మంత్రి కారుమూరి అన్నారు. గుడ్ మార్నింగ్ తణుకు కార్యక్రమంలో భాగంగా స్థానిక చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో వాకర్స్‌ను మంత్రి ఆదివారం కలసి మాట్లాడుతూ ఇప్పటికే ఎన్నో సౌకర్యాలు కల్పించామని రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో మంచినీటి సదుపాయం కలుగజేస్తామని చెప్పారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఇందుగపల్లి బలరాంకృష్ణ, మెహర్ అన్సారీ, నూకల కనకదుర్గ, వీరమల్లు ఫణీంద్రకుమార్, చేశెట్టి లలితా శంకర్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో కార్యాలయంలో తనిఖీలు



భీమవరం క్రైం, మార్చి 31 : భీమవరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పార్సిల్ రవాణా కార్యాలయంలో ఎన్నికల కోడ్ అనుసరించి భీమవరం బస్టాండ్‌లో కార్గో సర్వీసుల కార్యాలయం ప్రాంగణంలో ఉన్న పార్సిల్‌ను వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం భారీగా తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా బీజేపీకి చెందిన నరేంద్రమోదీ ఫొటో ముద్రించిన బనియన్లు, బీజేపీ జెండాలు, పార్టీ ప్లకార్డులు భారీగా పట్టుకున్నారు. దీనికి సబంధించిన పట్టుబడిన సామగ్రిని స్వాధీనం చేసుకొని విచారణ చేపడుతున్నామని సీఐ తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



27వ వార్డులో కాంగ్రెస్ నాయకుడు అర్జునరావు ఇంటింటా ప్రచారం

పాలకొల్లు అర్బన్, మార్చి 31 : కాంగ్రెస్ పార్టీ నియోజక సమన్వయ కర్త కొలుకులూరి అర్జునరావు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటా ప్రచారం చేశారు. 27వ వార్డు బద్దావానిపేట, రైల్వే స్టేషన్ గూడ్స్ రోడ్డు, సాయినగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్ళి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను వివరించారు. ప్రతీ పేదవాడికి కాంగ్రెస్ పార్టీ అంటే ఎంతో అభిమానం అని, కాంగ్రెస్ పార్టీ సమానవాటా న్యాయం, యువ న్యాయం, రైతు న్యాయం, నారీ న్యాయం, శ్రామిక న్యాయం పేరుతో 5 న్యాయాలు పేరుతో మేనిఫెస్టో విడుదల చేసిందని తెలిపారు.